


గిరిజన విద్యార్థికి 'ఉమెన్ ఇన్ ఏవియేషన్'

ప్రజాశక్తి-సీతంపేట

మండలంలోని ధారపాడు పంచాయతీ రామనగరం చెందిన ఆరిక అనిత జాతీయస్థాయిలో వ్యాసరచన పోటీలో సత్తా చాటారు. విమానయాన రంగంలో మహిళలను ప్రోత్సహించాలనే లక్ష్యంతో శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాలకు చెందిన విద్యార్థినిలకు శ్రీకాకుళం మహిళా డిగ్రీ కళాశాలలో ఈ నెల 18నఉమెన్ ఇన్ ఏవి యేషన్ ఇండియా వ్యాసరచన పోటీలో నిర్వహించారు. ఈ పోటీల్లో 150 మంది విద్యార్థినిలు హాజరు కాగా అనిత ఎంపికయ్యారు. ఈ మేరకు ఢిల్లీలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో పౌర విమానశాఖ కార్యదర్శి ఉమ్మంగ్ ఉల్మామ్, ఉమెన్ ఇన్ ఏవియేషన్ ఇండియా అధ్యక్షులు రాధా భాటియా, చైర్మన్ వి పి ఎస్ కుమార్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు వీరికి పౌర విమానయశాఖ మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు అభినందించారు. అలాగే ధారపాడు సర్పంచి జి.సుందరమ్మ అభినందించారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ

కదం తొక్కిన కార్మికులు, కర్షకులు

ప్రజాశక్తి - పార్వతీపురం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక, గిరిజన సంఘాల సమన్వయ కమిటీ ఆధ్వర్యాన పట్టణంలో మంగళవారం భారీ ర్యాలీ నిర్వహించారు.ఆయా సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యాన స్థానిక పాత బస్టాండ్ నుంచి కలెక్టర్ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించి, అనంతరం ధర్నా చేశారు. జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్ బంటు దాసు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కిసాన్ మోర్చా రాష్ట్ర నాయకులు పి.రున్నీ, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మధరావు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి సంకీర్ణ ప్రభుత్వం వచ్చిన గతంలో అనుసరించిన కార్పొరేట్ అనుకూల విధానాలనే అమలు చేస్తోందని అన్నారు. వ్యవసాయ నల్ల చట్టాలను రద్దు చేసిన సందర్భంలో సంయుక్త కిసాన్ మోర్చా నాయకత్వానికి రాతపూర్వకంగా ఇచ్చిన హామీలకు భిన్నంగా కార్పొరేట్ అనుకూల విధానాలు అమలు బిజెపి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని చెప్పారు. బడ్జెట్ సందర్భంగా డిజిటల్ అగ్రికల్చర్ మిషన్ (డిఎం) పథకాన్ని ప్రకటించిందని, దీనివల్ల 2026 నాటికి 11 కోట్ల మంది రైతులను కార్పొరేట్ కంపెనీలకు అనుసంధానం చేస్తారని ప్రకటించిందని చెప్పారు. ఈ ఏడాది ధాన్యం గోదాముల కొనుగోళ్లు నిలిపివేసిందని చెప్పారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరలు 2 నుండి 7 శాతం మాత్రమే పెంచిందని చెప్పారు. ఈ స్థితిలో పంటల కొనుగోళ్ల నుంచి తప్పుకుని రైతాంగాన్ని మార్కెట్ శక్తుల దయాదాక్షిణ్యాలకు వదలివేస్తుందని చెప్పారు.



పట్టణంలో భారీ ర్యాలీ చేస్తున్న రైతు, కార్మికసంఘాల నాయకులు

ఎరువులపై నియంత్రణ తొలగించడంతో వాటి ధరలు రైతులకు అందుబాటులో లేకుండా పెరిగిపోతున్నాయని చెప్పారు. వ్యవసాయ ఉపకరణాలపై జిఎస్‌టి భారంగా మారిందని అన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో గిరిజన యూనివర్సిటీ నిర్మించాలని కోరారు. అక్రమ భూ సేకరణ నిలుపు చేయాలని, 2013 భూ సేకరణ చట్టం, ఫారెస్ట్ రైట్ యాక్ట్ 1/70 అమలుపరచాలని కోరారు. కార్యక్రమంలో కార్మిక, రైతు సంఘాల నాయకులు జి.వెంకటరమణ, రెడ్డి వేణు, వి.ఇందిర, శ్రీనునాయుడు, సూరిబాబు, బుడితి అప్పల నాయుడు, జీవ, రంజిత్‌కుమార్, సూరయ్య, కుమార్, రాజు, గంగు నాయుడు, సత్యనారాయణ, పాల ఈశ్వరరావు, దుర్గారావు, సంగం, లక్ష్మునాయుడు, ఈశ్వరరావు, కిసాన్ మోర్చా సమన్వయ కమిటీ సభ్యులు మాట్లాడారు.

సాలూరు రూరల్ : కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిలిపివేయాలని, మున్సిపల్ కార్మికుల ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం సిఐటియు రాజేశ్వరరావు పార్కు నుండి మెయిన్ రోడ్డు మీదుగా మంత్రి సంధ్యారాణి ఇంటి వరకు కార్మికులు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికులను ఉద్దేశించి సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్ వై నాయుడు మాట్లాడుతూ స్థానిక మున్సిపల్ పరిధిలో పనిచేసే కార్మికులందరికీ బకాయి జీతాలు అందేలా పాలకవర్గంతో చర్చించాలని, రానున్న సాలూరు గ్రామ దేవత పండగను దృష్టిలో పెట్టుకొని కార్మికుల సంఖ్య పెంచాలని కోరారు. అనంతరం మంత్రి సంధ్యారాణికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి సంధ్యారాణి కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలో గల సమస్యలు పరిష్కారమయ్యేలా అధికారులతో చర్చిస్తానని, మిగిలిన సమస్యలను ప్రభుత్వానికి నివేదిస్తానని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఉమా, వాటర్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఢర్రు సంతోష్,పారిశుద్ధ్య విభాగ కార్మిక సంఘం నాయకులు టి శంకర్రావు ,రవి, స్వప్న కార్మికులు పాల్గొన్నారు.



మంత్రి సంధ్యారాణికి సమస్యలను విన్నవిస్తున్న సిఐటియు నాయకులు



అంబేద్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, అధికారులు

రాజ్యాంగం జాతికి మార్గ నిర్దేశం : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

రాజ్యాంగం జాతికి మార్గ నిర్దేశనం అని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అన్నారు. రాజ్యాంగ దినోత్సవాన్ని కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళ వారం నిర్వహించారు. డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేశ సుస్థిర మనుగడకు రాజ్యాంగ పీఠిక ఆధారమని అన్నారు. రాజ్యాంగానికి రూపకల్పన చేసిన డాక్టర్ బి ఆర్ అంబేద్కర్‌ను దేశం ఎన్నటికీ మరువవదని పేర్కొన్నారు. ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా నిలబడిందంటే దీనికి కారణం భారత రాజ్యాంగమేనని, ప్రజలు స్వేచ్ఛాస్వాతంత్ర్యాలతో జీవించడానికి రాజ్యాంగం పీఠికలో పేర్కొన్న అంశాలే ప్రధాన కారణమని తెలిపారు. అంబేద్కర్ సారధిగా ఏర్పాటైన డ్రాఫ్టింగ్ కమిటీ భిన్నత్వ సమ్మేళితమైన దేశానికి రాజ్యాంగాన్ని రూపొందిం చడంలో ఎంతగానో శ్రమించారని, మనం అంతా గర్వించ దగిన రాజ్యాంగాన్ని రూపొందించడానికి అవిశ్రాంతం గా శ్రమించిన గొప్ప మేధావులకు ఘనమైన నివాళి అందించాలన్నారు. జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోబిక మాట్లాడుతూ రాజ్యాంగాన్ని అవగాహన చేసుకుని చక్కటి జీవనానికి బాటలు చేసుకోవాలని చెప్పారు. అనంతరం రాజ్యాంగ పీఠిక ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో డిఇఒ ఎన్.తిరుపతి నాయుడు, కలెక్టరేట్ ఎఒ సావిత్రి, విభాగ అధిపతులు శ్రీరామ్మూర్తి, జయ, రాధాకృష్ణపాల్గొన్నారు.

సీతంపేట: స్థానిక ఐటిడిఎ కార్యాలయంలో భారత రాజ్యాంగ దినోత్సవ కార్యక్ర మాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయ ఆవరణలో గల బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి ఎఒ సునీల్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. భారత రాజ్యాంగ రచనలో అంబేద్కర్ చేసిన సేవలను కొనియాడారు. అనంతరం రాజ్యాంగంలోని పీఠిక ప్రతిజ్ఞను ఉద్యోగులు అందరూ చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ గీతాంజలి, వెలుగు ఎపిడి సన్యాసిరావు, డిఎస్ఒ అప్పారావు, డిప్యూటీ డిఇఒ నారాయడు, ఎఎంఒ కోటిబాబు, జిసిడిఒ రాములమ్మ, ఇతర అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మాజీ డిప్యూటీ సిఎంకు తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి - సాలూరు

మాజీ డిప్యూటీ సిఎం రాజన్నదొరకు మంగళవారం పెనుప్రమాదం తృటిలో తప్పింది.మంగళవారం భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఆయన పిఎన్ బొడ్డవలసలో అంబేద్కర్ విగ్రహానికి నివాళులు అర్పించిన తిరిగి సాలూరు వైపు వస్తుండగా బంగారమ్మపేట వద్ద గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి కాన్వాయ్ ఎదురైంది. పిఎన్ బొడ్డవలస తోటలో కామాక్షి అమ్మవారి ఆలయం నిర్వాహకులు నిర్వహించిన వనభోజన కార్యక్రమానికి మంత్రి సంధ్యారాణి హాజరయ్యారు. అయితే బంగారమ్మపేట వద్ద ఎదురుగా వస్తున్న మాజీ డిప్యూటీ సిఎం రాజన్నదొర కారును మంత్రి బుల్లెట్ ప్రూఫ్ కారు స్వల్పంగా ఢీ కొట్టి వెళ్ళిపోయింది. రాజన్నదొర కారు డ్రైవర్ చాకచక్యంగా వాహనాన్ని బాగా ఎడమవైపుకు నిలబెట్టడంతో ప్రమాదం తప్పింది. తన కారును ఢీకొట్టిన తర్వాత ఏమైందో తెలుసుకునేందుకైనా కాన్వాయ్ ఆపకపోవడంపై రాజన్నదొర విచారం వ్యక్తంచేశారు. ఇరుకు ప్రదేశంలో విఐపిలు ప్రయాణించే వాహనాలను జాగ్రత్తగా నడపకపోతే ప్రమాదాలు జరుగుతాయన్నారు.

నేడు రక్తదాన శిబిరం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ టి.శ్రీవరం తెలిపారు. బయట వ్యక్తులు ఎవరైనా వచ్చి రక్తదానం చేయదలుచుకుంటే ఆహ్వానిస్తునట్లు ఆమె తెలిపారు.

ఉపాధ్యాయులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

డీఎస్సీ నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరుతూ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలల్లో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు చేస్తున్న దీక్షలకు ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి కిల్లో సురేంద్ర మద్దతు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్లు ఆమోదించాలని కోరారు. గురుకుల నిబంధనల ప్రకారం అవుట్సోర్సింగ్ ఉపాధ్యాయులను సిఆర్టీలుగా మార్చాలని డిమాండ్ చేశారు.,2024 మెగా డీఎస్సీ నుంచి గురుకుల ఉపాధ్యాయులను మినహాయించాలని కోరారు. ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర వ్యాప్తంగా పూర్తి మద్దతు ఉంటుందని, ఏ ఉద్యమానికి పిలుపునిచ్చిన పూర్తిగా మద్దతు ఇస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎం.లక్ష్మణరావు, కోలక అవినాష్, గౌరవ అధ్యక్షులు ఎస్ అప్పారావు కోశాధికారి కె.రామస్వామి, జిల్లా కమిటీ సభ్యులు పి.తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు. అలాగే మాజీ ఎమ్మెల్యే గాదె శ్రీనివాసులనాయుడు మాట్లాడుతూ సమస్య పరిష్కారానికి అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు, ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటానని అన్నారు. ఆయన వెంట పిఆర్టియు రాష్ట్ర నాయకులు అమరాపు సూర్యనారాయణ ఉన్నారు.

అంబేద్కర్ విగ్రహానికి వినతి

ఏడో రోజు దీక్షల్లో భాగంగా రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉద్యోగ భద్రత కల్పించాలని, డీఎస్సీ నుండి పోస్టులు మినహాయించాలని, సమాన పనికి సమాన, కనీస వేతనాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన గురుకుల పాఠశాల, కళాశాల అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు, అధ్యాపకులు దివాకర్, రమేష్, రాజేష్, వెంకట్, జగదీష్, జ్యోతి, లక్ష్మి, కవిత, గిరిజన సంక్షేమ సంఘం నాయకులు రంజిత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న గిరిజన సంఘం నాయకులు సురేంద్ర

జిల్లాలో 1,862 మంది ఉపాధ్యాయ ఓటర్లు : జెసి

ప్రజాశక్తి - పార్వతీపురం

ఉపాధ్యాయ నియోజక వర్గం శాసనమండలి ఎన్నికకు సంబంధించి ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణ నాటికి జిల్లాలో 1,862 మంది ఓటర్లు ఉన్నట్లు జాయింట్ కలెక్టర్ ఎస్.ఎస్.శోబిక వెల్లడించారు. ఈ నెల 23న ముసాయిదా ప్రచురణ అయిందని, దీనిపై దావాలు, అభ్యంతరాలను దాఖలు చేయడానికి డిసెంబర్ 9 వరకు అవకాశం ఉన్నట్లు ఆమె చెప్పారు. ఉపాధ్యాయ నియోజకవర్గ శాసనమండలి ఎన్నికకు సంబంధించి ముసాయిదా జాబితా, పోలింగ్ కేంద్రాలపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆమె ఛాంబరులో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ జిల్లాలో ఫారం -19 ద్వారా దరఖాస్తులను ఈనెల 6 వరకు స్వీకరించామన్నారు. అందులో భాగంగా 2,136 దరఖాస్తులు అందాయని, వాటిలో 340 ఆన్‌లైన్ ద్వారా, 1796 ఆఫ్‌లైన్ ద్వారా స్వీకరించబడ్డాయని చెప్పారు. వాటిలో ఇప్పటివరకు 1,862 క్లెయిమ్‌లు ఆమోదించగా, 274 క్లెయిమ్‌లు తిరస్కరించినట్లు ఆమె తెలిపారు. ముసాయిదా ఓటరు జాబితాలో ఏవైనా అభ్యంతరాలు ఉన్నా, సవరణల కోసం ఫారం-7, -8లో దరఖాస్తు చేసుకోవచ్చని ఆమె చెప్పారు. అప్పటివరకు వచ్చిన క్లెయిమ్‌లు, అభ్యంతరాలను పరిష్కరించి డిసెంబర్ 25న సప్లిమెంటరీ ఓటరు జాబితాను , డిసెంబర్ 30న ఎలక్టోరల్ రోల్స్ తుది ప్రచురణ జరుగుతుందని జేసీ స్పష్టం చేశారు. జిల్లాలో 15 పోలింగ్ స్టేషన్లు ప్రతిపాదించబడ్డాయని అన్నారు. పోలింగ్ స్టేషన్లు, ముసాయిదా జాబితాపై రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ అభిప్రాయాలు సూచనలను అందించాలని కోరగా, ఎటువంటి అభ్యంతరాలు వ్యక్తం చేయలేదు.

7న మెగా పేరెంట్స్ మీటింగ్

ప్రజాశక్తి - పార్వతీపురం

మెగా పేరెంట్స్ మీటింగ్‌ను అన్ని యాజమాన్యాలు డిసెంబర్ 7న నిర్వహించాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. మంగళవారం ఎంఇఒలు, హెచ్ఎంలతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశానికి తల్లిదండ్రు లంతా హాజరు కావాలని, అందుకు అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. పాఠశాల ప్రాంగణాన్ని సుందరంగా తీర్చిదిద్దాలన్నారు. సమావేశంలో ప్లాస్టిక్ వాడరాదని, మంచి సుహృద్భావ వాతావరణంలో జరగాలని, పాఠశాల అభివృద్ధి, విద్యార్థుల విద్యా ప్రమాణాలు, హాజరు శాతం, తది విద్యార్థుల ఆరోగ్య వివరాలతో ఆరోగ్య కార్డులు సైతం అందించాలని అన్నారు. పాఠశాల ఆవరణలో మన బడి మన తోట, శాస్త్ర విజ్ఞాన ప్రయోగ శాలలు, మైదానం, తరగతి గదులు, వంట గదులు తల్లిదండ్రులకు చూపించాలని సూచించారు. తల్లిదండ్రులకు రంగోలి, టగ్ ఆఫ్ వార్, వాలీ బాల్, టెన్ని క్వైట్ తదితర ఆటలు నిర్వహించాలన్నారు. విద్యార్థులు కార్యక్రమ వ్యాఖ్యాతగా (యాంకర్) వ్యవహరించాలని చెప్పారు. పాఠశాల ప్రగతి, విద్యా ప్రమాణాలు కోసమే చర్చ, ప్రసంగాలు ఉండాలని, రాజకీయ ప్రసంగాలు ఉండరాదని స్పష్టం చేశారు. వికలాంగ విద్యార్థులను ఈనెల 29 వరకు నియోజకవర్గ కేంద్రాల్లో నిర్వహిస్తున్న అలీమ్ కో శిబిరాలకు పరికరాల నమోదుకు హాజరు కావచ్చని చెప్పారు.

నేడు బాల్య వివాహాల రహిత ఆంధ్ర ప్రదేశ్

బాల్య వివాహాల రహిత ఆంధ్ర ప్రదేశ్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించాలన్నారు. ఇందులో ప్రతిజ్ఞ చేయాలని, గ్రామ సభలు పెట్టాలని చెప్పారు. బాల్య వివాహాలు వీడియో కాన్ఫరెన్స్‌లో డిఇఒ ఎన్.తిరుపతినాయుడు, సమన్వయకర్త వై.శంకరరావు పాల్గొన్నారు.



ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందించిన ఏకలవ్య పాఠశాల ప్రిన్సిపల్, సిబ్బంది

రాష్ట్రస్థాయి క్రీడల్లో ఏకలవ్య విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి -గుమ్మలక్ష్మీపురం

నేషనల్ ఎడ్యుకేషన్ సొసైటీ ఫర్ స్టూడెంట్స్ (ఏకలవ్య) అరకువాలీలో జరిగిన రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో స్థానిక ఏకలవ్య పాఠశాలకు చెందిన (కో-ఎడ్యుకేషన్) విద్యార్థులు మంచి ప్రతిభను కనబరిచారు. యోగ అండర్-14 బాలుర విభాగంలో 8వ తరగతి విద్యార్థి ఆర్య నంద్ బంగారు పతకం సాధించగా, ఆరో తరగతి విద్యార్థి దినేష్ రజతం, ఏడో తరగతి విద్యార్థి సిద్ధార్థ కాంస్య పతకాలు సాధించారు. బాక్సింగ్‌లో అండర్-19 53కేజీ బాలుర విభాగంలో మోహన్‌రావు బంగారు పతకం సొంతం చేసుకున్నాడు. వాలీబాల్ అండర్-19 బాలుర విభాగంలో ఇంటర్ మొదటి సంవత్సరం (బైపిసి) విద్యార్థి బి.విజయ్, ఖో-ఖో అండర్-19 గర్ల్స్ విభాగంలో నీలవేణితో పాటు మిగతా క్రీడాకారులు రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో ప్రతిభ కనబర్చి జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. రాష్ట్ర స్థాయి క్రీడల్లో యోగ -14 బాలుర విభాగంలో విన్నర్స్, ఆల్ రౌండ్ ఛాంపియన్ షిప్ సాధించడం పట్ల ప్రిన్సిపల్ వీర్‌సింగ్, వ్యాయామ ఉపాధ్యాయుడు - రాహుల్ కుమార్ అభినందించారు. డిసెంబర్‌లో చత్తీష్‌ఘడ్‌లో జరిగే జాతీయస్థాయి క్రీడల్లో పాల్గొంటారని ప్రిన్సిపల్ తెలిపారు.

రైతు ఆదాయం రెట్టింపు కావాలి : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలోని వ్యవసాయ, అనుబంధ రైతుల ఆదాయం రెట్టింపు కావాలని, ఆ దిశగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళ వారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రాథమిక రంగాల పురోగతిపై ఆయా శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. జిల్లాలోని వ్యవసాయ, ఉద్యానవన, మత్స్య, పశు సంవర్ధక, పట్టు తదితర రైతుల ఆదాయం ప్రస్తుత ఆదాయం కంటే రెట్టింపు ఆదాయం వచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. రబీలో ఈ క్రాప్ పంటలో గతేడాది కంటే మరింత పెరగాల్సిన అవసరం ఉందని అన్నారు. జిల్లాలో ఎకో ఫార్మ్ పాండ్స్ పై అవగాహన కల్పించాలని, మొబైల్ ఇరిగేషన్ యూనిట్లను వినియోగించుకునేలా రైతులను ప్రోత్సహించాలని కలెక్టర్ సూచించారు. మొబైల్ ఇరిగేషన్ యూనిట్లను ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి సులభంగా తరలిం చవచ్చని, ఇటువంటి యూనిట్లను గిరిజన ప్రాంతా ల్లో వినియోగించుకునేలా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు ప్రారంభ మయ్యాయని, వర్షాలు రాకమునుపే కొనుగోళ్లు పూర్తికావాలని అన్నారు. ఉద్యానవన పంటలను మరింత ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాలో 65వేల ఎకరాల్లో జీడీ పంట ఉందని, దీన్ని మరింత పెంచాల్సిన అవసరం ఉందన్నారు. 2వేల ఎకరాల్లో పామాయిల్ పంట సాగు కావాలని, అలాగే చేపలు, పాలు, మాంసం ఉత్పత్తులను పెంచేలా చర్యలు తీసు కోవాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి కె.రాబర్ట్ పాల్, పశు సంవర్ధక శాఖాధికారి డా.ఎస్.మన్మధరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళా ఉపాధ్యాయులకు సన్మానం

వీరఘట్టం :మండలంలోని కంబరవలస జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయునిగా విధులు నిర్వహిస్తున్న డిటివి రత్నంకు మంగళవారం దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు. భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఉపాధ్యాయిని సన్మానించినట్లు హెచ్ఎం వై.లక్ష్మి తెలిపారు. కార్యక్రమంలో ఎ.వెంకటరావు, ఎస్.రవికుమార్, ఎ.చంద్రమౌళి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కోటదుర్గమ్మను దర్శించుకున్న డిసి బాబ్జీరావు

పాలకొండ : స్థానిక కోట దుర్గమ్మను ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ బాబ్జీరావు కుటంబ సమేతంగా మంగళవారం దర్శించుకున్నారు. వీరికి ప్రధాన అర్చకులు దార్లపూడి లక్ష్మీప్రసాద్ శర్మ వేదమంత్రాలతో స్వాగతం పలికి అమ్మవారి తీర్థ ప్రసాదాలు ఇచ్చి సాగనంపారు. అమ్మవారు విశిష్టత గురించి డిసి బాబ్జీకి వివరించారు

ప్రభుత్వం దృష్టికి ఉపాధ్యాయ సమస్యలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

గిరిజన గురుకుల పాఠశాల ఔట్సోర్సింగ్ ఉపాధ్యాయులు, అధ్యాపకుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. గతం వారం రోజులుగా తమ సమస్యల పరిష్కారానికై దీక్షలు చేస్తున్న ఉపాధ్యాయ సంఘ నాయకులు మంగళవారం ఎమ్మెల్యేను తన క్యాంపు కార్యాలయంలో తెలుసుకొని ఈ మేరకు వినతి అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గిరిజన ఉపాధ్యాయుల సమస్య తన దృష్టిలో ఉందని, పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. అనంతరం జనసేన మండల నాయకులు ఆగూరు మణికి వినతి అందించి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని కోరగా, ఈ విషయాన్ని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకు వెళ్తానని తెలిపారు.

లింగ వివక్షకు వ్యతిరేకంగా ర్యాలీ

ప్రజాశక్తి - సీతంపేట

గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో లింగ వివక్షపై వ్యతిరేకంగా మంగళవారం ఐటిడిఎ, వెలుగు సిబ్బంది ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా సమాజంలో లింగ వివక్షతను విడనాడాలని, పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపులను అరికట్టాలని నినాదాలు చేపడుతూ ర్యాలీ నిర్వహించారు. ఆడపిల్లలకు విద్య, బాల్యవివాహాలు, గృహహింస వంటి అంశాలపై వివిధ శాఖల సమన్వయంతో ఈనెల 25 నుంచి డిసెంబర్ 23 వరకు వివిధ కార్యక్రమాల ద్వారా మహిళలకు అవగాహన కల్పించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఐటిడిఎ కార్యాలయం నుంచి సీతంపేట వరకు ర్యాలీ నిర్వహించి, అనంతరం మానవహారం చేపట్టారు. కార్యక్రమంలో తహాశీల్దార్ అప్పలరాజు, వెలుగు ఎపిడి సన్యాసిరావు, వరలక్ష్మి డిపిఎం రమణ, ఎపిఎంలు కమల కుమారి, పార్వతమ్మ, అంగన్వాడీ సిబ్బంది, కళాశాల విద్యార్థినులు, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు అడ్డంకులు తొలగేనా?

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని శంబరలో చేపడుతున్న అభివృద్ధి పనులకు స్వల్ప అడ్డంకులు ఏర్పడుతుండడంతో పనులు వేగవంతానికి ఒకంత అడ్డంకులుగా మారాయని చెప్పడంలో సందేహం లేదు. సుమారు రూ.50 లక్షలతో సిరిమాను తిరిగే ప్రధాన రహదారులు అభివృద్ధి చేసేందుకు నిధులు మంజూరయ్యాయి. అలాగే పోలమాంబ ఆలయాల ఆవరణలోతో కలిపి సిసి రోడ్ల నిర్మాణానికి రెండు కోట్ల 40 లక్షల నిధులు మంజూరయ్యాయి. పండగ సమయం సమీపం కావస్తుండడంతో పనులు వేగవంతం చేసేందుకు అధికార యంత్రాంగం నిరంతరం శ్రమిస్తున్నారు. పంచాయతీరాజ్ డిఇ ఆదేశాల మేరకు ఎఇ రజిత పనులు పర్యవేక్షిస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే వనం గుడి రహదారు పనులు 70 శాతం పూర్తి కాగా మిగిలిన ప్రధాన రహదారి పనులు చేపట్టాల్సి ఉంది. ఇక్కడ సిసి రోడ్డు నిర్మాణం మధ్యలో విద్యుత్ స్తంభాలు ఉండడంతో రహదారి నిర్మాణం చేసినా ఇబ్బందులు తప్పవని పలువురు అంటున్నారు. సిసి రోడ్డు నిర్మాణానికి ముందే విద్యుత్ స్తంభాలు రహదారి మధ్యలో లేకుండా పక్కకు మార్చాలని జెడ్‌పిటిసి ఎం.శ్రీనివాసరావు అధికారులకు సూచించిన సంగతి తెలిసిందే. ఇదిలా ఉండగా గోముఖి నది పరివాహ ప్రాంతంలో రాతికట్టు నిర్మాణం పనులు చకచక జరుగుతున్నాయి. నడిమి వీధిలో సిసి రోడ్డు నిర్మాణ పనులకు కొంత అడ్డంకిగా మారిన స్థలాలకు సంబంధించి ఆయా ఇళ్ల యజమానులతో గ్రామ పెద్దలంతా కలిసి అభివృద్ధి కోసం ముందుకు రావాలని కోరే ఆస్కారం ఉంది. సుమారు మూడు అడుగులు మేర ఇరువైపులా స్థలాలు ఇచ్చేందుకు అంగీకరిస్తే రహదారి అభివృద్ధి పనులు ముందుకు సాగి అన్ని విధాలా వాహనాల రాకపోకలకు, సిరిమాను తిరిగేందుకు ఉపయుక్తంగా ఉంటుందని పలువురు భావిస్తున్నారు.



వెడల్పు కావాల్సిన నడిమివీధి రోడ్డు

3న జిల్లా స్థాయి యువజనోత్సవాలు

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

జిల్లా స్థాయి యువజనోత్సవాలు డిసెంబరు 3న జరుగుతాయని సెట్విజ్ సిఇఒ బి.రామగోపాల్ మంగళవారం ఒక ప్రకటన తెలిపారు. ఈ ఉత్సవాల్లో భాగంగా సైన్స్ అండ్ టెక్నాలజీ మేళా, జానపద నృత్యాలు, గీతాలు గ్రూప్/ వ్యక్తిగతగా పాల్గొని వచ్చన్నారు. కవిత్వం, స్టోరీ రైటింగ్, పెయింటింగ్, ఉపన్యాసం, ఫోటోగ్రఫీ వ్యక్తిగతంగా పోటీ ఉంటుందన్నారు. హస్తకళలు, చేనేత వస్త్రాలు, వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన, ఫిట్ ఇండియా స్టాల్, డ్రోన్ల ప్రదర్శన, 5జి టెక్నాలజీ ప్రదర్శన, కోవిడ్ వ్యాక్సినేషన్ స్టాల్, స్కిల్ డెవలప్మెంట్ స్టాల్ ప్రదర్శన, అమ్మకాలు జరుగుతాయని తెలిపారు. ఈ పోటీల్లో 15-29 ఏళ్ల మధ్య వయసు గల యువతీ యువకులు పాల్గొనవచ్చని తెలిపారు. ఈ పోటీల్లో విజేతలకు నగదు బహుమతులు అందజేస్తామన్నారు. జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన వారు రాష్ట్రస్థాయి యువజనోత్సవాల్లో పాల్గొనేందుకు అవకాశం లభిస్తుందన్నారు. రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం సాధించిన వారు జాతీయ స్థాయి యువజనోత్సవాల్లో పాల్గొంటారని ఆయన వివరించారు. ఇతర వివరాలకు 8247554334 నెంబర్ ఫోన్ కు కార్యాలయం పని వేళలలో సంప్రదించాలని ఆయన ఈ ప్రకటనలో తెలిపారు.


సమావేశంలో మాట్లాడుతున్న ట్రైకార్ బోర్డు సభ్యులు లావణ్య

గిరిజన సంక్షేమానికి పెద్దపీట : లావణ్య

ప్రజాశక్తి - కురుపాం

విజయవాడలో గిరిజన సంక్షేమ కార్యాలయంలో మంగళవారం జరిగిన ట్రైకర్ బోర్డు సమావేశంలో ట్రైకర్ బోర్డు మెంబర్ పువ్వల లావణ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2023 - 24 సంవత్సరంలో జరిగినటువంటి ఖర్చులు గూర్చి చర్చించి అనంతరం 2024 - 25 సంవత్సరానికి గిరిజన సంక్షేమానికి కావాల్సిన బడ్జెట్ గూర్చి యాక్షన్ ప్లాన్ తయారు చేశామన్నారు. కూటమి ప్రభుత్వ హయాంలో గిరిజన సంక్షేమానికి పెద్ద పీట వేసి గిరిజనులకు ట్రైకార్ రుణాలు, ప్రత్యేక లోన్లు రాయితీపై అందించేందుకు ముందస్తు ప్రణాళికలు తయారు చేస్తున్నామని తెలిపారు.

రాష్ట్రస్థాయి పతకాలు సాధించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

రాష్ట్ర స్థాయి వికలాంగుల క్రికెట్ పోటీల్లో పాల్గొంటున్న జిల్లా వికలాంగుల జట్టుకు జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్, జాయింట్ కలెక్టర్ ఎస్.ఎస్.శోబిక జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ తరుపున మంగళవారం క్రికెట్ కిట్‌ను బహుకరించారు. డిసెంబరు 8 నుంచి 12 వరకు విశాఖలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటున్న వికలాంగుల జట్టుకు ప్రశంసించారు. జిల్లా తరపున క్రికెట్ పోటీలో పాల్గొని క్రికెట్ క్రీడల్లో తమ నైపుణ్యాన్ని ప్రదర్శించి, రాష్ట్ర స్థాయి క్రికెట్ క్రీడలో విజేతగా నిలిచి మన జిల్లా ఖ్యాతిని నిలపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా క్రీడా అధికారి ఎస్. వెంకటేశ్వరరావు, డిఇఒ ఎన్.తిరుపతిరావు, ఎస్‌జిఎఫ్ ఎం.మురళీకృష్ణ, డిటి గాంధీ పాల్గొన్నారు.

ఆయుష్‌పై అవగాహన

ప్రజాశక్తి - సీతానగరం

ఆయుష్ వైద్యంపై మండలంలోని బూర్జ ఆయుర్వేద వైద్యాధికారి డాక్టర్ టి.హేమాక్షి ఆధ్వర్యాన అవగాహన నిర్వహించారు. దేశ్ కా ప్రకృతి పరీక్షన్ అభయన్ కార్యక్రమాన్ని నెల రోజుల పాటు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా మెడికల్ క్యాంపులు, మారుమూల ప్రాంతాల్లో ఇంటింటి ప్రకృతి పరీక్ష అభయాన్ ప్రచారాలు నిర్వహిస్తామన్నారు. కార్ర్యమంలో భాగంగా గ్రామ పెద్దలు, జెడ్పీ హైస్కూల్ విద్యార్థులతో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.

ఇంటింటి సర్వే పరిశీలన

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని లచ్చయ్యపేట, లక్ష్మీపురం, చల్లమనాయుడు వలసలో జరుగుతున్న ఇంటింటి సర్వేను ఎంపిడిఒ పి.త్రివిక్రమరావు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెలాఖరు నాటికి పూర్తిస్థాయిలో సర్వేను పూర్తి చేయాలన్నారు. ప్రతి ఇంట్లో ఉండే అన్ని కాలంలను సర్వేలో పూర్తి చేయాలన్నారు. ప్రతి ఇంటిని ప్రతి వ్యక్తిని వదలకుండా సర్వే చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా పంచాయతీ కార్యదర్శులు పి వెంకట నాయుడు, పీటర్, శ్రీనివాసరావు, సంతోష్ కుమార్‌తో పాటు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - కొమరాడ

మండలంలోని గుణానుపురంలో ధాన్యం కొనుగోలు కేంద్రం బుధవారం ప్రారంభించనున్నట్టు మండల వ్యవసాయ అధికారి పి.శంకర్రావు అన్నారు. మంగళవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ కురుపాం ఎమ్మెల్యే తోయిక జగదీశ్వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తారన్నారు.

శస్త్ర చికిత్సలకు వృద్ధుల తరలింపు

ప్రజాశక్తి - కురుపాం

కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా 20మంది వద్ధులను శస్త్ర చికిత్సలకు విజయనగరం తరలిస్తున్నట్లు నేత్ర వైద్యాధికారి జీరు నగేష్‌రెడ్డి తెలిపారు. కురుపాం, గుమ్మలక్ష్మీపురం మండలాల పరిధిలో గతంలో కంటి వైద్యశిబిరాలు నిర్వహించి ఎంపిక చేసినట్లు చెప్పారు. అందరికీ ఉచితంగా చికిత్స, రవాణా, మందులు, భోజన వసతి కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆరోగ్యమిత్ర, ఆశాకార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

జియో ట్యాగింగ్ సర్వేను పూర్తి చేయాలి

ప్రజాశక్తి - కురుపాం

హౌస్ హెెూల్డ్ జియో టాగింగ్, ఎన్ పిసిఐ సర్వే త్వరితగతిగా పూర్తి చేయాలని ఎంపిడిఒ జె.ఉమామహేశ్వరి అన్నారు. మండలంలోని బియ్యాలవలస, కిచ్చాడా, కురుపాం 1, 2, మొండెంఖల్ సచివాలయాలను మంగళవారం సందర్శించారు.ఈ సందర్భంగా సిబ్బంది హౌస్ ఓల్డ్ జియో టాగింగ్, ఎన్ పి సీ ఐ సర్వేను పరిశీలించి జరుగుతున్న లోటు పాట్లు అడిగి తెలుసుకున్నారు. అనంతరం సర్వే వేగంగా జరగడానికి పలు సూచనలు, సలహాలు అందించి త్వరితగతిన పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కె.ఆనందరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి పనులపై సోషల్ ఆడిట్

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని 27 పంచాయతీల్లో జరిగిన ఉపాధి హామీ పనులపై మంగళవారం సోషల్ ఆడిట్ నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధి హామీ పీడీ కె.రామచంద్రరావు పాల్గొన్నారు. రూ.32 కోట్లతో 3027 పనులు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. పనులు జరిగిన తీరు, వేతనదారులకు బిల్లుల చెల్లింపులు వంటి అంశాలపై గ్రామాల్లో చేసిన సర్వేను ప్రజా వేదికలో ఎస్‌ఆర్పీలు వివరించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ సాల్మన్‌రాజు, ఎపిఒ ఆర్.బాబురావు ఉన్నారు.

గిరిజన వృద్ధులకు రగ్గులు పంపిణీ

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణ పోలీస్ స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్, వృద్ధమిత్ర కోఆర్డినేటర్ కె.కృష్ణమూర్తి మంగళవారం చందలంగి గిరిజన గ్రామంలోని చలి తీవ్రత అధికంగా ఉండడంతో ఆ గ్రామంలోని 40 మంది వృద్ధులకు, వికలాంగులకు, మహిళలకు రగ్గులు, స్టీలు గ్లాసులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు త్రినాధ, వాసు, రాజు తదితరులు పాల్గొన్నారు.

అడారిపాడు వద్ద పాఠశాల నిర్మించాలి

ప్రజాశక్తి - పాచిపెంట

మండలంలోరి అడారిపాడు వద్ద పాఠశాల నిర్మించాలని గిరిజనులు మంగళవారం నిరసన తెలిపారు. ఆరు గిరిజన గ్రామాలకు చెందిన గిరిజనులు చదువుకోవడానికి ఒక పాఠశాల నిర్మించాలని గిరిజనులు అప్పారావు, సార వెంకట్రావు, సిపిఎం జిల్లా నాయకులు కోరాడ ఈశ్వరరావు కోరారు. అడారిపాడు, బుచ్చంపాడు, బంగారు గుడ్డి, కాట్రగుడ్డి, ఇప్పల గుడ్డి గిరిజన గ్రామాలకు చెందిన పిల్లల కోసం అడారిపాడు వద్ద బడి నిర్మించి తమ పిల్లలకు చదువులు చెప్పాలని కలెక్టర్, ఐటిడిఎ పిఒను కోరారు.

నీటి నిల్వలు అనారోగ్య హేతువులు

ప్రజాశక్తి - కురుపాం

నీటి నిల్వలు అనారోగ్య హేతువులని జిల్లా సహాయ మలేరియా అధికారి సూర్యనారాయణ అన్నారు. మంగళవారం మండలంలో మొండెంఖల్ పిహెచ్‌సి పరిధిలో గల పి.లేవిడి గ్రామాన్ని సందర్శించి జ్వరాలకు గురైన ప్రజలను జిల్లా కన్సల్టెంట్ రామచంద్ర తో కలిసి పరామర్శించారు. అనంతరం సిబ్బందితో ఆయన మాట్లాడుతూ మలేరియా ప్రస్తుతం తగ్గినప్పటికీ ఎడిస్ దోమల కారణంగా ప్రస్తుతం డెంగీ, చికున్ గున్యా వ్యాధులు వ్యాపించే అవకాశాలు ఎక్కువగాఉన్నాయన్నారు. అనంతరం మొండెంఖల్లు పిహెచ్‌సిని సందర్శించి ల్యాబ్ టెక్నీషియన్ పనితీరును పరిశీలించి రికార్డులను పక్కాగా అప్డేట్‌గా ఉంచాలని సూచించారు. కార్యక్రమం లో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉపకరణాలకు 92 మంది పేర్లు నమోదు

ప్రజాశక్తి - సాలూరు

స్థానిక వైటిసి ఆవరణలో మంగళవారం విభిన్నప్రతిభావంతులు, వయోవృద్ధులకు సహాయ ఉపకరణాల సరఫరాకు గుర్తింపు శిబిరం నిర్వహించారు. కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఆదేశాల మేరకు శిబిరాలను నిర్వహిస్తున్నట్లు విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఎడి కవిత చెప్పారు. ఈ శిబిరంలో 92 మంది వికలాంగులు, వృద్ధుల పేర్లు నమోదు చేసుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమానికి హాజరైన వికలాంగులు, వృద్ధులకు నీడ్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ పి.వేణుగోపాలరావు భోజన సదుపాయం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని డిపిఒ కొండలరావు పరిశీలించారు.

రాజ్యాంగం అందరికీ ఆదర్శం : మంత్రి

ప్రజాశక్తి - సాలూరురూరల్

రాజ్యాంగం ఏర్పడి 75ఏళ్లు పూర్తయిన సందర్భంగా సాలూరు పట్టణంలోని నాలుగో వార్డులో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి రాష్ట్ర మహిళా శిశు, సంక్షేమ శాఖ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యా రాణి మంగళవారం పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సంధ్యారాణి మాట్లాడుతూ అంబేద్కర్ రాజ్యాంగాన్ని రచించించి ప్రజలు ఏ విధంగా ఉండాలి, వారి హక్కులు, విధులు ప్రతి ఒక్కరికీ తెలియజేసి మంచి మార్గంలో నడిపించేలా చేశారని చెప్పారు. భారత రాజ్యాంగంలో అందరూ కలిసి మెలసి మెలగాలనే ప్రధాన లక్ష్యంగా సాగిందన్నారు. ముఖ్యంగా అట్టడుగున గల అణగారిన వర్గాలను బయటకు తీసుకురావాలని ఒక మంచి ప్రయత్నంతో రాజ్యాంగాన్ని పొందుపరిచారని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఆర్‌పి భంజ్‌దేవ్ తదితరులు పాల్గొన్నారు.

పాలకొండ : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల (బాలురు)లో 75వ రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రిన్సిపల్ వి.హరగోపాల్ నేతృత్వంలో జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవం ఏర్పడ్డానికి దారి తీసిన పరిస్థితుల గురించి విద్యార్థులకు వివరించారు. కాలేజీ పౌరశాస్త్ర అధ్యాపకులు ఎ.వెంకటేశ్వర్ రాజ్యాంగ పీఠికను చదివి విద్యార్థిని, విద్యార్థులతో రాజ్యాంగ దినోత్సవ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపల్ పైల శంకరరావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి వెలమల అప్పారావు, జి.గోవిందరావు అధ్యాపకులు పాల్గొన్నారు.

వీరఘట్టం : మండలంలోని వండువలో మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ బి.వెంకటరమణ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేశారు. కంబరవలస జిల్లా


మాట్లాడుతున్న మంత్రి సంధ్యారాణి

పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుల వై.లక్ష్మి, వీరఘట్ట జిల్లా పరిషత్తు బాలుర ఉన్నత పాఠశాలలో హెచ్ఎం బి.సుంబోరా, తదితర పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎం.కల్యాణి, మహిళలు, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పార్వతీపురం రూరల్: భారత రాజ్యాంగ దినోత్సవం వేడుకలు పట్టణంలోని పలుచోట్ల ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర తన క్యాంపు కార్యాలయంలో కార్యకర్తలు, నాయకులతో కలిసి అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. రాజ్యాంగం గొప్పతనం గురించి వివరించారు. అలాగే మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు పట్టణంలోని ప్రధాన రహదారిపై ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ కె.రూపేష్ ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ దినోత్సవం వేడుకగా నిర్వహించి బాబాసాహెబ్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఆధ్వర్యంలో విద్యార్థులచే ప్రతిజ్ఞ, రాజ్యాంగ దినోత్సవ ఆవశ్యకత వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు రాజు, రవి కుమార్, సుకన్య, శాంతి ,తాతబాబు, సత్యనారాయణ, శ్రీధర్, కైలాష్ ,శర్మ లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

కురుపాం : స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద రాజ్యాంగ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎంపీడీవో జె. ఉమామహేశ్వరి రాజ్యాంగ నిర్మాతలు అంబేద్కర్, బాబు రాజేంద్రప్రసాద్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎపిఒ బావాజీ, జెఇ మూర్తి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సాలూరు రూరల్ : ప్రపంచంలోనే అతి పెద్ద లిఖిత రాజ్యాంగం భారత రాజ్యాంగమనిరాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కె వి సత్యన్నారాయణ అన్నారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రాంగణంలో రాజ్యాంగ అమలుకు తమ వంతు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఇన్చార్జి ఉపాధ్యాయులు సుధీర్ రాజు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలతో నివాళి అర్పించారు. సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు భాస్కర్ రావు విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన, వకతృ, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు.

వీరఘట్టం : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా విద్యార్థుల చే ప్రతిజ్ఞ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డిఎస్‌వి త్రినాధ్ , వైస్ ప్రిన్సిపాల్ ఎం.కుమార స్వామి, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పార్వతీపురం టౌన్ : డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేద్దామని సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ, పట్టణ పౌర సంక్షేమ సంఘం కార్యదర్శి పాకల సన్యాసి రావులు అన్నారు. భారత రాజ్యాంగం ఆమోదించిన దినోత్సవ సందర్భంగా వేమకోటివారివీధిలో గల అంబేద్కర్ విగ్రహానికీ మాజి కౌన్సిలర్ సొండి గోపి, వెంకటరమణలు పూలమాల వేసి, అనంతరం అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో కోల సుధాకర్, సొండి భాస్కరరావు, కోల రాజు, కోల నవీన్ స్థానికులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల వివరాలు తప్పనిసరి కాదు

ప్రజాశక్తి - పార్వతీపురం

జెఎన్ బి హాస్టల్ పోర్టల్‌లో గిరిజన సంక్షేమ ఉపాధ్యాయుల బ్యాంక్ ఖాతా, ఆధార్, పాన్ ఐడి వివరాల అప్ లోడ్ తప్పనిసరి కాదని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మురళీమోహన్ రావు, అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు తోట రమేష్, కె.భాస్కరరావు చెప్పారు. ఈ మేరకు మంగళవారం వారు గిరిజన సంక్షేమ డిడి గయాజుద్దీన్‌కి వినతిపత్రం అందజేశారు. గిరిజన సంక్షేమ ఉపాధ్యాయుల వివరాలు తప్పనిసరి కాకపోయినా సహాయ గిరిజన సంక్షేమ అధికారులు ఉపాధ్యాయులపై ఒత్తిడి పెంచుతున్నారని, అప్ లోడ్ చేయకపోతే చర్యలు తీసుకుంటామని బెదిరిస్తున్నారని చెప్పారు. అప్ లోడ్ తప్పనిసరి కాదని సంక్షేమ రాష్ట్ర, జిల్లా అధికారులు చెపుతున్నా స్థానిక అధికారులు ఒత్తిడి చేయడం సరికాదని వారు తెలిపారు.

సిమెంట్ బిల్లులు చెల్లించండి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గ్రామ సచివాలయ భవనాలు 90శాతం పూర్తయ్యాయని, సిమెంట్ బిల్లుల చెల్లింపులు మాత్రం నేటికీ జరగలేదని సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షులు బొత్తాడ గౌరీశంకర్రావు ఉపాధిహామీ పీడీ కె.రామచంద్ర రావు దృష్టికి తీసుకెళ్లారు. గుమ్మలక్ష్మీపురం, ఎల్విన్‌పేట, మండ గ్రామ సచివాలయ భవనాలకు సంబంధించిన బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. లక్షలాది రూపాయలు పెట్టుబడి పెట్టిన కాంట్రాక్టర్లకు సిమెంట్ బిల్లులు కాకపోవడంతో చాలా ఇబ్బంది పడుతున్నారని అన్నారు. పీడీ సానుకూలంగా స్పందించి ఎపిఒ, కంప్యూటర్ ఆపరేటర్లను పిలిచి మాట్లాడి బిల్ అయ్యేలా చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డుమ్మంగి, రెల్ల, ఇరిడి, మండ, రాయగడ జమ్మూ, నెల్లికిక్కువ సర్పంచులు ఉన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని జోగింపేట సచివాలయం పరిధిలో రైతు సేవా కేంద్రం వద్ద మంగళవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని టిడిపి క్లస్టర్ ఇన్‌ఛార్జి బొమ్మినేని లక్ష్మీనారాయణ, మాజీ సర్పంచ్ ఉడమల సూర్యనారాయణ, పాపంవలస సర్పంచ్ మరుడాన గౌర్నాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు దళారుల వద్ద మోసపోకుండా రైతు సేవా కేంద్రాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ప్రతి కేంద్రంలో ధాన్యాన్ని ఇచ్చి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర పొందాలన్నారు. అలాగే కాశీపేట, తామరకండి, లక్ష్మీపురం, గుచ్చిమి తదితర గ్రామాల్లో రైతు సేవా కేంద్రాలు ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి తెంటు వెంకట అప్పల నాయుడు, మాజీ సర్పంచ్ తేలు చంద్రశేఖర్, టిడిపి నాయకులు తిరుపతిరావు, బి.చిరంజీవి, ఎం.సంజీవులు, మజ్జి సాయిదత్తు, భాస్కరరావు, పువ్వుల బాలగోడేశ్వరరావు, బోను శ్రీనివాసరావు, చప్ప సుధాకర్, వై.వెంకట నాయుడు తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిని అందజేస్తున్న వాలంటీర్లు, సిఐటియు నాయకులు

వాలంటీర్ల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

వాలంటీర్ల సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షులు దిలీప్ కుమార్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మధరావు, కోశాధికారి గొర్లి వెంకటరమణ డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక పాతబస్టాండ్ నుండి కలెక్టరేట్ వరకూ ప్రదర్శన నిర్వహించి, అనంతరం కలెక్టరు ఎ.శ్యామ్ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గ్రామ, వార్డు వాలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని, బకాయి వేతనాలు చెల్లించాలని, రూ.10వేలు వేతనహామీ నెరవేర్చాలని, జాబ్ చార్ట్ ప్రకటించాలని, బలవంతంగా రాజీనామా చేయించిన వారిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరారు. దీనికి కలెక్టర్ స్పందిస్తూ వాలంటీర్ల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సిఐటియు పట్టణ నాయకులు బంకురు సూరిబాబు, పట్టణ పౌర సంక్షేమ సంఘం కార్యదర్శి పాకల సన్యాసిరావు, వాలంటీర్ల సంఘ నాయకులు మహేష్, మధుసూదనరావు, బాలకృష్ణ, ఆదిలక్ష్మి, సుజాత, సురేష్, సింహాచలం, మోహనరావు, భూషనరావు, జిల్లా వాలంటీర్లు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి

ప్రజాశక్తి - కొమరాడ

ప్రజారోగ్య సమస్యలు తలెత్తకుండా మెరుగైన వైద్య సేవలందించే దిశగా కృషి చేయాలని వైద్యారోగ్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు వైద్య సిబ్బందికి సూచించారు. ఈ మేరకు కె.ఆర్.బి పురం పిహెచ్సి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు నమోదు, రోగుల ఆరోగ్య తనిఖీ వివరాల రికార్డులు పరిశీలించారు. ప్రతి రోజూ నమోదవుతున్న ఒపీ,ఐపీ వివరాలు పరిశీలించారు. ల్యాబ్ తనిఖీ చేసి ల్యాబ్ పరికరాల పని తీరును గమనించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ బి.సామ్యూల్, టి.గణేష్ పట్నాయక్, డిప్యూటీ స్టాటిస్టికల్ అధికారి శంకర్, సుపర్వైజర్స్ బంగారుబాబు,శోభ, కృష్ణశారద, బద్రినారాయణ, వైద్య సిబ్బంది ఉన్నారు.

గోశాలలు రైతులకా... రాజకీయ నేతలకా?

మండల సమావేశంలో అధికారులను నిలదీసిన సభ్యులు

ప్రజాశక్తి - మక్కువ

స్థానిక మండల పరిషత్ కార్యాలయ మందిరంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశం మంగళవారం వాడీగా వేడిగా జరిగింది. ఎంపిపి మర్రి పారమ్మ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశం ఆలస్యంగా ప్రారంభమైనప్పటికీ సభ్యులు అడిగిన ప్రశ్నలకు కాలం అతీతమైన సభ ముందుకు సాగింది. తొలుత భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా రాజ్యాంగ నిర్మాణ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. ప్రతిజ్ఞ చేసి, రాజ్యాంగ పీఠికను చదివారు. అనంతరం జరిగిన అధికారుల సమీక్షలో ఎపిఒ ఈశ్వరమ్మ గోసాలల గురించి మాట్లాడుతుండగా సభ్యులు ఒక్కసారిగా ఆగ్రహంతో ఊగిపోయారు. రాజకీయ నాయకులకే ఎక్కువ కేటాయించారని, ఇందులో రైతులు తక్కువగా ఉన్నారని అన్నారు. జెడ్‌పిటిసి సభ్యులు మావుడి శ్రీనివాసరావు మాట్లాడుతూ గోసాలలకు పంచాయతీల తీర్మానం అవసరం లేదా అని ప్రశ్నించారు. మండలానికి కేవలం 17 మాత్రమే గోసాలలు మంజూరయ్యాయని సభలో పేర్లు వివరించారు. దీంతో 400కు పైగా దరఖాస్తులు తీసుకున్నప్పటికీ 17 కేటాయించడమేమిటిని సర్పంచులు నిలదీశారు. పంచాయతీరాజ్ ఎఇ రజిత సభకు వివరిస్తుండగా శంబర పోలమాంబ ఆలయ పరిసరాల్లో నిర్మిస్తున్న రహదారులు నాణ్యతగా నిర్మించాల్సిన బాధ్యత ఇంజనీరింగ్ అధికారులు పైనే ఉందని జడ్పిటిసి అన్నారు. ఆదిలోనే నాణ్యత లోపం జరగడం దారుణమన్నారు. విద్యుత్ స్తంభాల్లేక అనేక మంది రైతులు అవస్థలు పడుతున్నారని పలువురు సర్పంచులు సభలో ఎఇని నిలదీశారు. అలాగే పోలమాంబ వనం గుడి వద్ద రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాలను కూడా వెంటనే తొలగించాలని సభ్యులు కోరారు. దీనిపై విద్యుత్ ఎఇ జోగినాయుడు మాట్లాడుతూ వాటి పరిష్కారానికి ఉన్నతాధికారులకు నివేదిస్తానన్నారు. శంబరలో అంగన్వాడీ భవనం రెండో అంతస్తులో నిర్వహించడం పట్ల తహశీల్దార్ ఇబ్రహీం అంగన్వాడీ సిడిపిఒను వివరణ కోరారు. వెంటనే కేంద్రాన్ని వేరేచోటకు మార్చాలని సూచించారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



ఎఇకి సూచనలు ఇస్తున్న జెడ్‌పిటిసి సభ్యులు శ్రీనివాస నాయుడు

ఒక గింజా అదనంగా ఇవ్వాల్సిన అవసరం లేదు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - వీరఘట్టం

తేమ శాతం కరెక్ట్‌గా ఉంటే ఒక గింజ కూడా అదనంగా ఇవ్వాల్సిన అవసరం లేదని స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ, పాలకొండ సబ్ కలెక్టర్ యశ్వంత్ కుమార్ రెడ్డి రైతులకు సూచించారు. మండలంలోని హుస్సేన్‌పురం రైతు సేవ కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వమే నేరుగా ధాన్యం కొనుగోలు చేస్తుందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మీకు నచ్చిన చోట ధాన్యం అమ్ముకోవచ్చన్నారు. మరి కొంతమంది రైతులు తమ గ్రామంలో భూ రీసర్వే జరగలేదని, అడంగల్‌లో హెక్టార్లలో ఉన్నందున ఎకరాలుగా మార్చాలని విన్నవించుకున్నారు. సబ్ కలెక్టరు యశ్వంత్ కుమార్ రెడ్డి స్పందించి వెంటనే ఎకరాలుగా మార్చాలని తహశీల్దార్ సిహెచ్ సత్యనారాయణను ఆదేశించారు. ఎఒ జె.సౌజన్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు ఉదయాన ఉదయ్ భాస్కర్, పార్టీ సీనియర్ నాయకులు పి.కృష్ణమూర్తి నాయుడు, పట్టణ అధ్యక్షులు జామి లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

టార్పాన్లు సద్వినియోగం చేసుకోవాలి

సీతంపేట : మండలంలో కుడ్డపల్లిలో మంగళవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ టార్పాన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు టార్పాట్లను వినియోగించుకోవాలని కోరారు. రైతులను కూటమి ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని, గిరిజన రైతులకు అండగా ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో ఎంపిడిఒ కె.గీతాంజలి, ఎఒ పి.శ్రీదేవి, కూటమి నాయకులు కె.అప్పలనాయుడు, హెచ్ ప్రసాదరావు, మాజీ ఎంపిపి ఎస్.మాలయ్య తదితరులు పాల్గొన్నారు .

పలు గ్రామాల్లో పొలం పిలుస్తోంది

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలోని వెంగాపురం, పెదపెంకిలో పొలం పిలుస్తుంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. అలాగే అపరాల సాగుపై శిక్షణ, అంపావల్లి, పెదపెంకిలో జిల్లా వనరుల కేంద్రం సహాయ వ్యవసాయ సహాయకులు డి.భారతి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా సహాయ వ్యవసాయ సహకులు భారతి వరి మాగాణిలో అపరాలు సాగు, వాటి యాజమాన్య పద్ధతుల గురించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

సీతానగరం : మండలంలోని లక్ష్మీపురంలో పొలం పిలుస్తుంది కార్యక్రమంలో నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి అవినాష్ రైతులతో కలసి మొక్కజొన్నలో జీరో టిల్లేజ్ పద్ధతిని వివరించారు. ఈ పద్ధతి లో దుక్కు దున్నకుండా విత్తడం వల్ల రైతులకు దుక్కు ఖర్చులు ఆదా అవుతాయన్నారు. ఎకరాకు 8 కేజీలు విత్తనాలు, ఎకరాకు 50 కిలోల డిఎపి 150 నుంచి 175 కిలోలు, యూరియా 50 కిలోలు, పొటాషియం మూడు దఫాలుగా వేసుకోవావాలని సూచించారు. పదును చూసి విత్తనాన్ని విత్తుకోవాలన్నారు. డిసెంబర్ వరకు ఈ విధానంలో మొక్కజొన్న విత్తుకోవాలన్నారు. అలాగే కలుపు నివారణకు అట్రాజిన్ మందు పిచికారీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో విఎఎ వినయ్, రైతులు పాల్గొన్నారు.

కలుపు మందుల పట్ల అప్రమత్తం

ప్రజాశక్తి -పాచిపెంట

రైతులు కలుపు మందులు పిచికారీ చేసేటప్పుడు జాగ్రత్తగా పరిశీలించి వ్యవసాయ శాఖ సలహాలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి కె.తిరుపతిరావు సూచించారు. మండలంలోని కంకణపల్లిలో పొలం పిలుస్తుంది. కార్యక్రమంలో మాట్లాడుతూ వీలైనంత వరకు కలుపు మందులకు దూరంగా ఉండాలని, గిరిజన గ్రామాల్లో కూలీల కొరత ఉండదు కావున గొప్పులు తవ్వుకోవాలని, కలుపు మందు ఎక్కువగా వాడడం వల్ల పర్యావరణం దెబ్బతింటుందని అన్నారు. అంతే కాకుండా రసాయన ఎరువులను పూర్తిగా విడిచి పెట్టాలని, పశువులు ఎక్కువగా ఉన్నందున మూత్రం సేకరించి పొలాల్లో వేసుకోవడం ద్వారా భూమిని సారవంతం చేయొచ్చని తెలిపారు. అపరాలు, చిరుధాన్యాల సాగును పెంచాలని, వీలైనంత వరకు రసాయన ఎరువులను విడనాడాలని తెలిపారు. అనంతరం రైతులకు అపరాలకు విత్తనాలను పంపిణీ చేశారు.

కర్రివలసలో కూరగాయల మోడల్

నిరంతర ఆదాయాన్నిచ్చే కూరగాయల మోడల్‌ను మండలంలోని కర్రివలస ఐసిఆర్‌పి సుమలత ఆధ్వర్యంలో వేయించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ తక్కువ విస్తీర్ణంలో కూరగాయల మోడల్ ఎటిఎం మోడల్ అని, ఈ మోడల్ ద్వారా తీగ, దుంప జాతి ఆకు, కూరగాయలు ఎక్కువ రకాలు తక్కువ విస్తీర్ణంలో నిరంతరం పండించడం ద్వారా ప్రతిరోజు ఆదాయం పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో విఎఎ మోహన్‌కృష్ణ, సిఆర్‌పి విజయ్, నరసింహమూర్తి పాల్గొన్నారు.

విద్యార్థి దశ కీలకం : ఎస్ఐ

ప్రజాశక్తి - కొమరాడ

ప్రతి వ్యక్తికి విద్యార్థి దశ చాలా కీలకమని ఆ దశలో విద్యార్థులు మంచి మార్గాల్లో నడవాలంటే సత్ప్రవర్తనతో మెలగాలని ఎస్ఐ నీలకంఠం అన్నారు. మండలంలోని విక్రమపురం పంచాయతీ సుందరాపురంలో సంకల్పం అవగాహన కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు చట్టాలపై గుడ్ టచ్ బ్యాడ్ టచ్ సైబర్ క్రైమ్ తదితర అంశాలపై మంగళవారం అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించే ఆయన మాట్లాడుతూ వ్యసనాలకు దూరంగా ఉంటే వారి జీవితం సౌకర్యంగా ఉంటుందని అన్నారు. సెల్ఫోన్ వినియోగం పెరగడంతో పాటు అత్యధికంగా సైబర్ క్రైములు ఇతర మోసాలు బారినబడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని అన్నారు. కావున విద్యార్థులు చదువుకునే సమయంలో సెల్ ఫోన్‌కు ఎంత దూరంగా ఉంటే వారి భవిష్యత్తు బాగుంటుందని అన్నారు. కార్యక్రమంలో సిబ్బంది విద్యార్థిని విద్యార్థులు ఉన్నారు.

సీతంపేట : స్థానిక మెయిన్ రోడ్‌లో సంకల్పం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఎస్ఐ సంజీవ్ మాట్లాడుతూ యువత యాంటీ డ్రగ్స్ దూరంగా ఉండాలన్నారు. సైబర్ నేరాల గురించి అవగాహన కల్పించారు. మహిళా చట్టాల భద్రత గురించి వివరించారు. కార్యక్రమంలో హెచ్‌సి జనార్ధనమ్మ తదితరులు ఉన్నారు.

భూ తగాదాల్లో వ్యక్తికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - పాచిపెంట

భూతగాదాల్లో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన మండలంలోని పాంచాలిలో మంగళవారం చోటు చేసుకుంది. ఈ సంఘటనకు చెందిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని పాంచాలి గ్రామం కూనం బందవలస రెవెన్యూ పరిధిలో ఎం.కోటేశ్వర్ రెడ్డికి భూమి ఉంది. ఈ భూమికి ఆనుకొని సేనాపతి బంగార్రాజు భూమి ఉంది. ఇరువురికి సివిల్ తగాదులు ఉన్నాయి. మంగళవారం ఉదయం నీటి పైపులు విషయంలో కోటేశ్వరరెడ్డితో బంగార్రాజు కుటుంబ సభ్యులు గొడవకు దిగారు. కర్రలు, రాళ్లతో దాడి చేయడంతో కోటేశ్వర్ రెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు.గాయపడిన కోటేశ్వర్ రెడ్డిని సాలూరు సిహెచ్‌సికి చికిత్స నిమిత్తం హాజరుపర్చగా, మెరుగైన వైద్యం కోసం విజయ నగరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కోటేశ్వరరెడ్డి ఫిర్యాదు మేరకు కేసుదర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకట సురేష్ తెలిపారు.


పోలీసులు స్వాధీనం చేసుకున్న వ్యాను

ఆవులను అక్రమంగా తరలిస్తున్న వ్యాన్ సీజ్

ప్రజాశక్తి - కురుపాం

అక్రమంగా తరలిస్తున్న ఆవుల వ్యాన్‌ను సీజ్ చేసినట్టు ఎస్సై పి.నారాయణరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూలిగూడ జంక్షన్ వద్ద మంగళవారం వాహనాలు తనిఖీలు నిర్వహిస్తుండగా గుమ్మలక్ష్మీపురం నుంచి పార్వతీపురానికి ఇద్దరు వ్యక్తులు వ్యానులో 10 ఆవులు నిబంధనలకు విరుద్ధంగా తరలిస్తుండంతో వారిపై కేసు నమోదు చేసి వాహనాన్ని సీజ్ చేసి ఆవులను కొత్తవలస గోశాలకు పంపించామని తెలిపారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

బూర్జిగూడలో వరి కుప్పలు దగ్ధం

ప్రజాశక్తి - భామిని

మండలంలోని బూర్జిగూడలో మంగళవారం సాయంత్రం వరికళ్లాల్లో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో వరి చేను కుప్పలు, ఒక ట్రాక్టర్, వరి నూర్పిడి యంత్రం అగ్నికి దగ్ధమయ్యాయి. వరి నూర్పు జరుగుతున్న క్రమంలో అగ్ని ప్రమాదం చోటు చేసుకుందని తెలిపారు. చేతి కొచ్చిన పంట కళ్లేదుట కాలిపోవడంతో రైతులు బోరున ఏడ్చారు. ఈ ఘటనలో ఎటువంటి ప్రాణ నష్టం చోటు చేసుకోలేదు. ఎంత మేరకు ఆస్థి నష్టం , పూర్తి వివరాలు తెలియాల్సివుంది.

పగలు ఉద్యోగం... రాత్రి దొంగ తనం

మూడోసారి పట్టుబడ్డ దొంగ

ప్రజాశక్తి - మక్కువ

కంపెనీలో పగటిపూట ఉద్యోగం చేస్తూ రాత్రి వేళల్లో దొంగతనాలు చేస్తూ పోలీసులకు పట్టు పడ్డాడు ఓ దొంగ. మక్కువ ఎస్ఐ తెలిపిన వివరాలు ప్రకారం.. మండలంలో ఇటీవల జరిగిన ధాన్యం దొంగతనంపై కొయ్యన్నపేటకు చెందిన కొయ్యన మన్మధరావు ఈనెల 24న పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తాను ఆరబెట్టిన 16 బస్తాల ధాన్యం దొంగతనానికి గురయ్యాయని ఫిర్యాదు చేశాడు. విచారణ చేపట్టిన ఎస్ఐ ఎం. వెంకటరమణ మంగళవారం స్థానిక చర్చి సెంటర్ వద్ద సాలూరు మండలం రాగపు వలస గ్రామానికి చెందిన పోతల రామకృష్ణ ఆటోలో 16 బస్తాల ధాన్యాన్ని తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఆయన తెలిపారు. పోలీస్ స్టేషన్లో ముద్దాయి మూడోసారి పట్టుబడినట్లు ఆయన తెలిపారు. రామకృష్ణ విజయనగరంలోని ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడన్నారు. పట్టుబడ్డ ఆటోను, ధాన్యంను సీజ్ చేసి కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.